క్లుప్తంగా

మృతి చెందిన దళిత విద్యార్థులకు ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలి

ఒంగోలు వన్‌టౌన్: నగరంలోని కొప్పోలు వద్ద రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన దళిత విద్యార్థుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.10 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని దళిత నాయకుడు నీలం నాగేంద్రరావు ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఒంగోలు నుంచి స్కూటీపై వెళ్తున్న మాల విద్యార్థులను వాటర్ ట్యాంకర్ ఢీకొట్టడంతో మృతి చెందారన్నారు. ఇద్దరు విద్యార్థులకు తండ్రి కూడా గతంలోనే మృతి చెందడంతో తల్లి కూలి పనులు చేసి చదివిస్తోందన్నారు. విద్యార్థుల మృతిపై సీఎం చంద్రబాబు స్పందించాలన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

సంతనూతలపాడు: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా స్థానిక గ్రంథాలయంలో ఆదివారం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. గ్రంథపాలకుడు కే సత్యనారాయణ అధ్యక్షతన కవి సమ్మేళనాలు, సెమినార్లు, రచయితల సందేశాల కార్యక్రమాలు నిర్వహించారు. వ్యాసరచన పోటీలకు న్యాయ నిర్ణేతగా ఎస్.రంగ నాయకులు వ్యవహరించారు. పోటీల్లో విజేతలకు వారోత్సవాల ముగింపు రోజు బహుమతులు అందజేయనున్నట్టు గ్రంథ పాలకుడు తెలిపారు.

126 మందికి ఉచిత వైద్య పరీక్షలు



రోగులకు పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

నాగులుప్పలపాడు: మనం, మన ఊరు, మన ఈదుమూడి ఆధ్వర్యంలో మండలంలోని ఈదుమూడి గ్రామంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించి 126 మందికి వైద్య పరీక్షలు చేశారు. సంస్థ వ్యవస్థాపకుడు కావూరి వాసు శ్రీరామ్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వారి సహకారంతో వైద్య శిబిరం నిర్వహించి ఉచితంగా మందులు కూడా అందించారు. సంస్థ సభ్యులు శ్రీనివాసులు, బ్రహ్మయ్య, ప్రసాద్, వెంకటరామయ్య, వీరాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

మూఢ విశ్వాసాలపై జనార్దన్ పోరాటం స్ఫూర్తిదాయకం



జనార్దన్‌కు నివాళులర్పిస్తున్న నాయకులు

ఒంగోలు టౌన్: సోషల్ మీడియా ద్వారా మూఢ విశ్వాసాలపై అలుపెరుగని పోరాటం చేసిన కొతారి జనార్దన్ ఆలోచనలు సమాజాన్ని సజీవంగా నిలుపుతాయని న్యాయమూర్తి మెట్ల కృష్ణ అన్నారు. ఆదివారం ఉదయం మెట్ల వెంకట సుబ్బయ్య రాఘవరాణి స్మారక భవనంలో జనార్దన్ సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి ప్రసంగిస్తూ విశ్వమానవ సంక్షేమ సంఘ జిల్లా అధ్యక్షుడిగా కొతారి జనార్దన్ ప్రజాస్వామిక అభ్యుదయ కార్యక్రమాలు నిర్వహించారని తెలిపారు. జనార్దన్ మరణం తీరనిలోటన్నారు. ఓపీడీఆర్ రాష్ట్ర అధ్యక్షుడు చావలి సుధాకర్ అధ్యక్షత వహించగా విశ్వమానవ సంక్షేమ సంఘ సభ్యుడు పెసలు మస్తాన్ రావు, సంయుక్త కిసాన్ మోర్చ జిల్లా అధ్యక్షుడు చుండూరి రంగారావు, విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ పి.పేరయ్య, సీపీఐ ఎంఎల్ రెడ్‌స్టార్ జిల్లా కార్యదర్శి భీమవరపు సుబ్బారావు, విరసం అధ్యక్షుడు పిన్నిక శ్రీనివాస్, రచయిత అంజిబాబు, షేక్ సిద్దాంబి తదితరులు పాల్గొన్నారు.



సంకువారిగుంట గ్రామం



రోడ్డుపై ఉధృతంగా ప్రవహిస్తున్న పెద్దవాగు వద్ద బందోబస్తు నిర్వహిస్తున్న పోలీస్, రెవెన్యూ సిబ్బంది (ఫైల్)

సంకువారిగుంటకు సంకటం..!

- పెద్ద వాగుతో గ్రామానికి పొంచి ఉన్న పెను ముప్పు
- గ్రామానికి వెళ్లేందుకు ఏకైక మార్గం
- ఆ మార్గంలోని చప్టాపై పెద్ద వాగు పొంగితే రాకపోకలు పూర్తిగా బంద్
- చప్టా స్థానంలో బ్రిడ్జి నిర్మించాలని ఏళ్ల తరబడి విజ్ఞప్తి చేస్తున్న గ్రామస్తులు
- అనేకసార్లు అర్జీలిచ్చినా పట్టించుకోని పాలకులు, అధికారులు

కొత్తపట్నం:

సంకువారిగుంట.. ఎస్సీ సామాజికవర్గం అధికంగా ఉండే ఓ గ్రామ పంచాయతీ. కొత్తపట్నం మండలంలోని పంచాయతీల్లోకెల్లా అతి చిన్న పంచాయతీ. అయినప్పటికీ ఆ గ్రామంలో ఎక్కువ మంది చదువుకుని గొప్ప గొప్ప ఉద్యోగాలు చేస్తున్నారు. ఉన్నత స్థాయికి చేరుకుని బాగా స్థిరపడినవాళ్లు చాలా మందే ఉన్నారు. పెద్ద పెద్ద ఉద్యోగాలు రావడంతో ఇతర జిల్లాలు, రాష్ట్రాలకు వలసలు వెళ్లి అనేక మంది అక్కడే స్థిరపడ్డారు. అయినప్పటికీ అలాంటి వారితో పాటు స్థానిక అధికారులుగానీ, ప్రభుత్వంగానీ సంకువారిగుంట గ్రామ అభివృద్ధి గురించి పట్టించుకున్న దాఖలాలే లేవు. దీంతో గ్రామానికి వెళ్లేందుకు ఉన్న ఒకేఒక మార్గం కూడా సక్రమంగా లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామంలో 400 నుంచి 500 మంది జనాభా ఉంటున్నారు. అందరూ ఎస్సీ సామాజికవర్గానికి చెందిన వారే. ఈ గ్రామానికి చేరుకునేందుకు సూరారెడ్డిపాలెం-ఈతముక్కల ఆర్‌అండ్‌బీ రహదారి నుంచి లోపలికి 1.20 కిలోమీటర్లు ప్రయాణించాల్సి ఉంది. గ్రామానికి చేరుకునేందుకు ఇదొక్కటే మార్గం. ఈ 1.20 కిలోమీటర్ల రోడ్డులో చప్టా కిందగా పెద్ద వాగు ప్రవహిస్తుంటుంది. భారీ వర్షం కురిసినప్పుడల్లా చప్టా మీదుగా ఉధృతంగా పెద్ద వాగు ప్రవహిస్తూ సంకువారిగుంట గ్రామానికి రాకపోకలు పూర్తిగా నిలిచిపోతున్నాయి. ఆ సమయంలో ఏదైనా అత్యవసరమైనా గ్రామం నుంచి రాకపోకలు సాగించే దారే లేదు. తుఫాన్‌లు, వరదలు, వాగులు పొంగినప్పుడు గ్రామంలో నుంచి సురక్షిత ప్రాంతాలకు వెళ్లే మార్గం లేదు. గ్రామానికి చుట్టూ వరద నీరు చేరడం వలన ఎటూ పోయే వీలులేక, ఉన్న ఒకే ఒక్క రోడ్డులో పెద్ద వాగు పొంగి ప్రవహిస్తూ ఉంటుండటంతో తరచూ గ్రామానికి పెనుముప్పు పొంచి ఉంటోంది. తుఫాన్‌ల సమయంలో ఒక్కోసారి వారం రోజుల పాటు గ్రామానికి రాకపోకలు నిలిచిపోతున్నాయి. ఆహారం, తాగునీరు, ఆరోగ్యం కోసం కూడా ఇబ్బందులు తప్పడం లేదు. అనారోగ్యం బారిన పడిన వారిని, బాలింతలు, గర్భిణులను ఆస్పత్రికి తీసుకెళ్లేందుకు కూడా కుదరక ప్రాణాలు పోతున్నాయి. పెద్దవాగు పొంగే సమయంలో ఎవరైనా బలవంతంగా నీటిలో దిగి వెళ్లకుండా పోలీస్, రెవెన్యూ సిబ్బంది కాపలా ఉంటున్నారు. ఏళ్ల తరబడి ఈ సమస్య ఉన్నప్పటికీ అధికారులు, పాలకులు పట్టించుకున్న పాపాన పోలేదు. గ్రామస్తులు అనేకసార్లు అర్జీలు అందించినా ఎవరూ స్పందించలేదు.





గుంతలమయంగా ఉన్న సంకువారిగుంట రోడ్డు

1.20 కిలోమీటర్ల రోడ్డు సైతం అధ్వానం...

ఈతముక్కల-సూరారెడ్డిపాలెం ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి సంకువారిగుంట గ్రామానికి వెళ్లే 1.20 కిలోమీటర్ల రోడ్డు కూడా అధ్వానంగా ఉంది. అడుగడుగునా గోతులతో నిండిపోయింది. వాహనాల రాకపోకల సమయంలో ప్రజలు నరకం చూస్తున్నారు. రాత్రి సమయంలో ప్రమాదాలు జరుగుతున్నాయి. మరమ్మతులకు రూ.5 లక్షల నిధులు కేటాయించినప్పటికీ పని చేయించేవారు లేరు. దీనిపై స్థానికుడు దుగ్గిరాల విజయకుమార్ ఇటీవల కలెక్టర్‌కు వినతి పత్రం అందజేసినా.. నేటికీ పట్టించుకోలేదు. ఒక వైపు పెద్ద వాగుపై బ్రిడ్జి నిర్మించక వర్షాల సమయంలో ఇబ్బంది పడుతూ.. మరోవైపు రోడ్డు సక్రమంగా లేక అవస్థపడుతున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి పెద్ద వాగుపై బ్రిడ్జి నిర్మించి రోడ్డు బాగుచేయాలని కోరుతున్నారు.

అనేకసార్లు అర్జీలు ఇచ్చాను



పెద్దవాగుపై బ్రిడ్జి నిర్మించాలని, రోడ్డుకు మరమ్మతులు చేయాలని గత పది సంవత్సరాల నుంచి అనేక సార్లు కలెక్టర్‌కు, ప్రజాప్రతినిధులకు అర్జీలు ఇచ్చాను. మేము ఎస్సీలమని చులకనగా చూస్తున్నారు. మా అర్జీని పట్టించుకోవడం లేదు. మా గ్రామానికి ప్రధాన సమస్య పెద్ద వాగు చప్టా స్థానంలో ఓవర్ బ్రిడ్జి నిర్మించాలి. 1.20 కిలోమీటర్ల తారు రోడ్డుకు గ్రాంట్ అయిన రూ.5 లక్షలతో వెంటనే మరమ్మతులు చేయాలి. ఇవి చేస్తే ప్రజలకు రహదారి సమస్య తీరుతుంది.

– దుగ్గిరాల విజయకుమార్, సంకువారిగుంట

నిధులు కేటాయించి గ్రామాన్ని అభివృద్ధి చేయాలి



మాది ఎస్సీ పంచాయతీ అని అందరూ చిన్నచూపు చూస్తున్నారు. మా గ్రామానికి రోడ్డు, పెద్దవాగుపై బ్రిడ్జి నిర్మించాలి. ఎన్నో సంవత్సరాల నుంచి ఈ సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయి. నిధులు వచ్చినా కాంట్రాక్టర్లు పనిచేయడం లేదు. అధికారులు చర్యలు తీసుకుని తగినన్ని నిధులు కేటాయించి మా గ్రామాన్ని అభివృద్ధి చేయాలి.

– కసుకుర్తి సుబ్బరత్నమ్మ, సర్పంచ్, సంకువారిగుంట

వైభవంగా అయ్యప్పస్వామి పడిభజన



అయ్యప్పస్వామి పడిభజనలో పూజలు చేస్తున్న బూచేపల్లి శివప్రసాదరెడ్డి, బూచేపల్లి వెంకాయమ్మ, కుటుంబ సభ్యులు



అధిక సంఖ్యలో పాల్గొన్న సర్వదీక్ష స్వాములు

చీమకుర్తి: చీమకుర్తిలోని బూచేపల్లి నివాసంలో శనివారం రాత్రి అయ్యప్పస్వామి పడిభజన కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. అయ్యప్పస్వామి మాల ధరించిన వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి, జెడ్పీ చైర్ పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వందలాది మంది మాలధారులు, భక్తులు పాల్గొన్నారు. అయ్యప్పస్వామి విగ్రహాలను సాక్షిరామలింగేశ్వరస్వామి ఆలయం నుంచి భక్తిశ్రద్ధలతో ఊరేగింపుగా బూచేపల్లి కుటుంబ సభ్యులు తీసుకొచ్చారు. అయ్యప్పస్వామి మెట్లను రూపొందించి స్వామివారి మండపాన్ని సుందరంగా అలంకరించారు. అయ్యప్పస్వామి భక్తిగీతాలు ఆలపించారు. అనంతరం భక్తులందరికీ భిక్ష ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో బూచేపల్లి శివప్రసాదరెడ్డి, వెంకాయమ్మ కుటుంబ సభ్యులు, స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి రూ.లక్ష విరాళం

చీమకుర్తి: చీమకుర్తిలోని శ్రీప్రసన్నాంజనేయస్వామి ఆలయ అభివృద్ధికి రిటైర్డ్ కరెంట్ లైన్‌మేన్ దొంతు వెంకటేశ్వర్లు, కోటేశ్వరమ్మ దంపతులు రూ.లక్ష విరాళం అందించారు. ఆలయ అభివృద్ధికి సద్వినియోగం చేయాలని ఆలయ కమిటీ చైర్మన్, సభ్యులను కోరారు. స్థానిక పద్మశాలీయుల సంఘ నాయకులు పుత్తూరి ఆంజనేయులు, పులిపాటి సాంబశివరావు, నారాయణం వెంకట్రావు, అర్చకులు శ్రీధర్ శర్మ తదితరులు దొంతు వెంకటేశ్వర్లు దంపతులను ఘనంగా సత్కరించారు.



వెంకటేశ్వర్లు దంపతులను సత్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

గిరిజన ఉద్యోగుల హక్కుల కోసం కృషి చేయండి

చీమకుర్తి: గిరిజన ఉద్యోగుల హక్కుల కోసం కృషి చేయాలని జిల్లా గిరిజన ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు కుంభా శ్రీనివాసరావుకు చీమకుర్తి గిరిజన హక్కుల సంఘ జిల్లా నాయకుడు పేరం శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు. కుంభా శ్రీనివాసరావు జిల్లా ఉద్యోగుల సంఘ అధ్యక్షునిగా ఎన్నికైన అనంతరం చీమకుర్తి వచ్చిన సందర్భంగా ఆయనను మర్యాదపూర్వకంగా చీమకుర్తి నాయకులు కలిసి పూలమాలతో సత్కరించారు. కార్యక్రమంలో చింతకింది అశోక్, షేక్ ఖాదర్‌బాషా, కడవా రామకృష్ణ, బండ్ల కొండలు పాల్గొన్నారు.



శ్రీనివాసరావును సత్కరిస్తున్న గిరిజన హక్కుల సంఘ నాయకులు

నిశ్చితార్థానికి హాజరైన ఎమ్మెల్యే బూచేపల్లి



వధూవరులను ఆశీర్వదిస్తున్న బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, నాయకులు

నాగులుప్పలపాడు: వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు, ఏఎంసీ మాజీ చైర్మన్ ఇనగంటి పిచ్చిరెడ్డి సోదరుడు, మాచవరం గ్రామ సర్పంచ్ ఇనగంటి సీతారావమ్మ వెంకట రమణారెడ్డి కుమారుడు నవీన్‌కుమార్‌రెడ్డి, సాయిశరణ్యల నిశ్చితార్థం వేడుకలకు ఆదివారం ఒంగోలులో వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి హాజరయ్యారు. కాబోయే దంపతులను ఆశీర్వదించారు. వైఎస్సార్ సీపీ నాయకులు నలమలపు కృష్ణారెడ్డి, క్రిష్టిపాటి శేఖర్‌రెడ్డి, కొత్తపట్నం ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి, చీమకుర్తి జెడ్పీటీసీ వేమా శ్రీనివాసరావు, తదితరులు హాజరయ్యారు.

శవయాత్రను అడ్డుకున్న ఎస్సైపై ఫిర్యాదు చేస్తాం

ఒంగోలు వన్‌టౌన్: అనాథ మహిళ శవయాత్రను అడ్డుకున్న ఎస్సైపై మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని దళిత హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు నీలం నాగేంద్రరావు తెలిపారు. స్థానిక సమితి కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కర్ణాటకకు చెందిన యశోద అనే మహిళ ప్రియుడు మోసం చేశాడని ఆత్మహత్య చేసుకుని మృతి చెందితే పోలీసులు పట్టించుకోలేదన్నారు. ఆత్మహత్యకు ముందుగా తాను మోసపోయానని ఒంగోలు మహిళా పోలీసు స్టేషన్‌లో ఆమె ఫిర్యాదు చేసి 45 రోజుల పాటు స్టేషన్ చుట్టూ తిరిగినా ఫలితం లేకపోయిందన్నారు. దీంతో ఈ నెల 11వ తేదీ జిల్లా ఎస్పీ కార్యాలయం వద్ద ఆమె ఆత్మహత్యకు యత్నించి కాలిన గాయాలతో జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ ఈ నెల 15వ తేదీ మృతి చెందిందని తెలిపారు. ఆమె బంధువులు శవాన్ని తీసుకెళ్లడానికి విముఖత వ్యక్తం చేయడంతో తాము అంత్యక్రియలు చేస్తామని ఒంగోలు తాలూకా పోలీస్‌స్టేషన్ సీఐ అజయ్‌కుమార్‌కు తెలిపామన్నారు. ప్రైవేటు అంబులెన్సు మాట్లాడుకుని శవాన్ని ఎక్కించిన అనంతరం ఎస్సై కృష్ణ పావని దళితుల చేతుల్లోని ఫ్లెక్సీలు లాక్కున్నారన్నారు. మీడియా కెమెరామెన్‌లపై జులుం ప్రదర్శించారన్నారు. దళిత నాయకులను ఎస్సై అవమానించారన్నారు. మృతి చెందిన మహిళ ఎస్టీ అని, ఈ సంఘటన ఎస్సీ, ఎస్టీ యాక్టు పరిధిలోకి వస్తుందని అన్నారు. నీలం వెంట జి.సుబ్బారావు, డి.రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

26న కలెక్టరేట్ వద్ద ధర్నాను విజయవంతం చేయండి



సమావేశంలో చర్చిస్తున్న సీఐటీయూ నాయకులు

సంతనూతలపాడు: ఒంగోలులోని కలెక్టరేట్ వద్ద ఈ నెల 26వ తేదీ నిర్వహించనున్న ధర్నాను విజయవంతం చేయాలని సీఐటీయూ నాయకులు కోరారు. సీఐటీయూ మండల కమిటీ సమావేశాన్ని కె.చంద్రశేఖర్ అధ్యక్షతన ఆదివారం సంతనూతలపాడులో నిర్వహించారు. జిల్లా కార్యదర్శి బంకా సుబ్బారావు పాల్గొని మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ నాయకత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం, రాష్ట్రాలలో దాని భాగస్వామ్యపక్ష ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ధర్నా చేస్తున్నట్లు తెలిపారు. అందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్మిక హక్కులు కాలరాసే నాలుగు లేబర్ కోడ్లు రద్దు చేయాలని, వ్యవసాయ కార్మికులకు 200 రోజులు ఉపాధి హామీ పనులు కల్పించాలని, రోజుకు రూ.600 కూలి ఇవ్వాలని, ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలని, ధరలు నియంత్రించాలని, రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరల చట్టం అమలు చేయాలని, విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ ఆపాలని, వ్యవసాయ రంగాన్ని కార్పొరేటీకరణ చేయడాన్ని ఉపసంహరించుకోవాలని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలని, ప్రజా ఉద్యమాలపై నిర్బంధాలను ఆపాలని కోరుతూ చేయనున్న ధర్నాలో కార్మికులు, రైతులు, ప్రజలు విరివిగా పాల్గొనాలని కోరారు. సమావేశంలో మండల కార్యదర్శి షేక్ మస్తాన్, నాయకులు తుళ్లూరు సుబ్బారావు, కె.ప్రసాద్, ఎస్‌కే నాగూర్, పి.శేషయ్య, పి.శ్రీమన్నారాయణ, కె.బక్కయ్య తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ల కోసమే జమిలి ఎన్నికలు

- సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు మాబు

మద్దిపాడు: కార్పొరేట్ల లబ్ధి కోసమే మోదీ ప్రభుత్వం జమిలి ఎన్నికలను తెరపైకి తీసుకొచ్చిందని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎస్కే మాబు అన్నారు. మండల పరిధిలోని పెద్దకొత్తపల్లి అంజయ్యనగర్లో ఆదివారం సీపీఎం మండల 6వ మహాసభ నిర్వహించారు. ముందుగా అమరవీరులకు జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా మాబు మాట్లాడుతూ కేంద్రంలో మోదీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చినా కూడా గత విధానాలనే అవలంబిస్తోందని అన్నారు. భారత దేశంలో ఎప్పుడూ లేని విధంగా నిరుద్యోగం పెరుగుతోందన్నారు. మోదీ నియంతృత్వ పాలనకు వ్యతిరేకంగా పోరాడాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అందుకు స్ఫూర్తిగా రైతుల ఉద్యమాన్ని తీసుకోవచ్చని చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తామని చెప్పిందని, వాటిని అమలు చేయలేక సతమతమవుతోందని చెప్పారు. పథకాలను అమలు చేయలేక ప్రజలను మభ్యపెట్టేందుకు రాజధాని చుట్టూ కూటమి ప్రభుత్వం తిప్పుతోందన్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించిన టీడీపీ.. ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన వెంటనే వాటిని అమలు చేస్తోందని దుయ్యబట్టారు. ముందుగా సీపీఎం జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకులు కాలం సుబ్బారావు, రఘురాం, మండల నాయకులు ఉబ్బా ఆదిలక్ష్మి, ఉబ్బా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాబు

ఘనంగా కార్తీకమాస వన సమారాధనలు



సంతనూతలపాడులో వ్రతంలో పాల్గొన్న ఆర్యవైశ్య దంపతులు

సంతనూతలపాడు: కార్తీకమాస వన సమారాధనలను పలు సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆర్యవైశ్య కళ్యాణ మండపం కమిటీ ఆధ్వర్యంలో సంతనూతలపాడులోని కళ్యాణ మండపంలో నిర్వహించిన కార్తీకమాస వన సమారాధన వేడుకల్లో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు ఏర్పాటు చేయగా, అధిక సంఖ్యలో దంపతులు పాల్గొని పూజలు చేశారు. కమిటీ అధ్యక్షుడు వేమా మల్లేశ్వరరావు, తదితరులు పర్యవేక్షించారు.

మల్లవరంలో బ్రాహ్మణ సమారాధన...

మద్దిపాడు: మండలంలోని మల్లవరం క్షేత్ర సన్నిధానంలో బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం కార్తీకమాస సమారాధన నిర్వహించారు. అన్నసంతర్పణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. వేద పండితులు గణపతి పూజ నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి బ్రాహ్మణులు పాల్గొన్నారు.

ఒంగోలులో కాపుల సమారాధన...

ఒంగోలు వన్‌టౌన్: కాపు సంఘం ఆధ్వర్యంలో ఒంగోలు సౌత్‌బైపాస్‌లోని డీ6 ఫంక్షన్ హాలులో ఆదివారం కాపు కార్తీకమాస వనభోజన మహోత్సవం నిర్వహించారు. కాపు సంఘ జిల్లా అధ్యక్షుడు కొక్కిరాల సంజీవకుమార్ అధ్యక్షత వహించగా, ఒంగోలు ఎమ్మెల్యే జనార్దన్, నాయకులు సింగరాజు రాంబాబు, కంది రవిశంకర్, ఐనాబత్తిన ఘనశ్యాం, మంత్రి శ్రీనివాసరావు, మద్దిశెట్టి శ్రీధర్, బండారు మదన్, తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్ రంజన్‌మిశ్రా కమిషన్‌ను వ్యతిరేకిస్తున్నాం



మాట్లాడుతున్న చప్పిడి వెంగళరావు

చీమకుర్తి: ఎస్సీ వర్గీకరణకు ప్రభుత్వం నియమించిన రాజీవ్ రంజన్‌మిశ్రా కమిషన్‌ను వ్యతిరేకిస్తున్నట్లు దళితమాలసంఘాల ఐక్యవేదిక జాతీయ అధ్యక్షుడు చప్పిడి వెంగళరావు తెలిపారు. ఆదివారం చీమకుర్తిలో స్థానిక మాలసంఘాల నాయకులతో కలిసి మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఎస్సీల స్థితిగతులను అధ్యయనం చేసేందుకు ఆర్టికల్ 338 ప్రకారం జాతీయ ఎస్సీ కమిషన్ ఉండగా, రాష్ట్ర ప్రభుత్వానికి మరో కమిషన్ వేసే అధికారం లేదన్నారు. చంద్రబాబు ప్రభుత్వం అనుసరిస్తున్న మాల వ్యతిరేక విధానాలను నిరసిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కేవలం ఓటు బ్యాంక్ రాజకీయాలకు దళితులను విభజించే కుట్రను రాష్ట్ర ప్రభుత్వం అనుసరించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక మాల సంఘ నాయకులు వేమా బాలకోటేశ్వరరావు, పిల్లి కోటేశ్వరరావు, మట్టిగుంట రామాంజనేయులు పాల్గొన్నారు.